మలక్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా నరేష్

మలక్‌పేట: మలక్‌పేట ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న గుంజె శ్రీనివాస్ బదిలీ కాగా ఆయన స్థానంలో సైఫాబాద్ డీఐ పిడమర్తి నరేష్‌ను నియమిస్తూ నగర సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ సీసీఎస్ డీడీ విభాగానికి బదిలీ అయ్యారు. అదే విధంగా మలక్‌పేట ఎస్సై జయంత్ సీసీఎస్ డీడీకి బదిలీ కాగా.. ఎస్‌బీ విభాగం నుంచి సంజీవరెడ్డి మలక్‌పేటకు రానున్నారు.

మండీలో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ సబ్‌రోడ్‌లో ఉన్న అల్ సాద్ బైట్ అల్ మండీలో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేశారు. లోపలంతా అపరిశుభ్రంగా ఉందన్నారు. వండిన ఆహార పదార్థాలపై మూతలు లేవని, వాటిపై బొద్దింకలు తిరుగుతున్నట్లు గుర్తించారు. మండికీ సంబంధించిన లేబుల్ కూడా లేవని వంటగదిలో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడకం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ సమైక్యతను చాటి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల దినేష్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి సలీంనగర్‌లో జరిగిన కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర నాయకుడు ప్రకాశ్ రెడ్డితో పాటు కార్పొరేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై జాతీయ సమైక్యతను చాటి చెప్పాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంజిత్‌కుమార్, భరత్, ప్రవీణ్, రమేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

దేశభక్తి చాటడం ప్రతి పౌరుడి బాధ్యత



లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

లింగోజిగూడ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శనివారం ఎల్‌బీనగర్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహానికి బీజేపీ రంగారెడ్డి అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వతంత్ర సమరయోధులు స్మరించుకుంటూ ప్రతి పౌరుడు చట్టాలను గౌరవిస్తూ దేశభక్తిని చాటాలన్నారు. నేటి యువత ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని తెలుసుకొని అదే బాటలో నడవాలని కోరారు. ఆనాడు ఎందరో అసువులు బాసిన మహనీయులకు వందనాలు చెప్పే గొప్ప కార్యక్రమాన్ని ఇచ్చిన రాష్ట్ర పార్టీకి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్త రవీందర్ గౌడ్, కృష్ణంరాజు, రాకేష్ యాదవ్, నాగరాజు, గట్టు రవి, భోస్లే శ్రీనివాస్, భరత్ వంశీ గణేష్ పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మలక్‌పేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని రాష్ట్ర కార్యదర్శి రాంచందర్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మూసారంబాగ్ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేత బొక్క మధుసూదన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నేత, మలక్‌పేట ఇన్‌చార్జి ఏర్పుల విష్ణుతో కలిసి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో మాదిగ, మాదిగ ఉపకులాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈనెల 14 తేదీన ఢిల్లీ నుంచి హైదరాబాద్ రానున్న మందకృష్ణకు పెద్ద ఎత్తున స్వాగతం పలకడానికి అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, నాగయ్య, వెంకటేష్, డాక్టర్ నాగరాజు, యాదగిరి, రాజు, శ్రీనివాస్, సంపత్, నవీన్ నర్సింగ్‌రావు, రమేష్, తులసి, జగదాంబ పాల్గొన్నారు.

యునానీ వైద్యంతోనే దీర్ఘకాలిక రోగాలకు చెక్



మందులను అందజేస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: వైద్యశాస్త్రంలోనే ఏడువేల సంవత్సరాల చరిత్ర కలిగిన యునానీ వైద్య చికిత్సతోనే దీర్ఘకాలిక రోగాలకు చెక్ పెట్టవచ్చని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం చంపాపేట నవజీవన జ్యోతి సంక్షేమ సంఘం భవనంలో ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లకు ఏర్పాటు చేసిన ఉచిత యునానీ వైద్య శిబిరాన్ని ఆయన అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టా వెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం మెడికల్ ఆఫీసర్ అస్మాఅంజుమ్, ఫార్మాసిస్ట్ అన్నపూర్ణ, హేమలత, జ్యోతి, ప్రేమావతి, నాయకులు సుంకరి రమేష్, లింగాల దశరథగౌడ్, యాదిరెడ్డి, నాగమణి, షానాజ్‌బేగం, కవిత పాల్గొన్నారు.



సింగరేణి కాలనీలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

- పెడదారి పడుతున్న యువకులు
- చోద్యం చూస్తున్న అధికారులు

గుప్పుమంటున్న గంజాయి!

సైదాబాద్: నగరంలో గంజాయి క్రయవిక్రయాలు జోరందుకోవడంతో యువత భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోంది. దీన్ని అరికట్టాల్సిన సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతో విచ్చలవిడిగా గంజాయి దందా కొనసాగుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బస్తీలు, కాలనీల్లో సైతం గంజాయి వాడకం పెరిగిపోతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కాలనీలో మూడేళ్ల క్రితం మద్యం మత్తులో ఓ యువకుడు ఆరేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఐదు రోజుల క్రితం ఎక్సైజ్ పోలీసులను చూసి భయంతో పరిగెత్తిన ఓ యువకుడు భవనంపై నుంచి పడిపోయి మృతి చెందాడు. ఈ రెండు ఘటనలకు కారణం మత్తు పదార్థాలే. అక్రమ మద్యం, మత్తు పదార్థాల క్రయవిక్రయాల కారణంగా సింగరేణి కాలనీలో హత్యలు, అత్యాచారాలు, దారిదోపిడీలు నిత్యకృత్యంగా మారుతున్నాయి.

నాడు గుడుంబా.. నేడు గంజాయి..

మురికివాడలో విచ్చలవిడిగా అక్రమ మద్యం, మత్తు పదార్థాల క్రయవిక్రయాలు జరుగుతున్నా ఎక్సైజ్ పోలీసులు మాత్రం ఇటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. వాటిని నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సింగరేణి కాలనీ నగరంలోని అతి పెద్ద మురికివాడల్లో ఒకటి. 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కాలనీలో 1792 ఇళ్లతో కూడిన వాంబే గృహ సముదాయం సహా పది వేల మందికి పైగా గుడిసెవాసులు కాయకష్టం చేసి కష్టం చేసుకొని కడుపు నింపుకునే వారే. అయితే వీరి కుటుంబాలను బెల్ట్‌షాపులు, మత్తు పదార్థాలు నిండా ముంచుతున్నాయి. గతంలో ఇక్కడ గుడుంబా విక్రయాలు జోరుగా సాగేయి. అప్పట్లో అధికారులు, సైదాబాద్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంతో క్రమేణా అవి తగ్గుతూ వచ్చాయి.



పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి..



నగరంలోనే పెద్ద మురికివాడల్లో ఒకటైన సింగరేణి కాలనీలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి. నగరంతో సహా ఇప్పుడు ఎక్కడైనా నేర నియంత్రణ, నేర విచారణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తున్నాయి. కానీ సింగరేణి కాలనీలో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడం విచారకరం. ఇక్కడ ఎవరూ సొంత నిధులతో కెమెరాలు ఏర్పాటు చేసుకోలేరు. కాబట్టి పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని సింగరేణిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే అక్రమ మద్యం, గంజాయి అమ్మకాలను అరికట్టవచ్చు.

– షేక్ మహమూద్, ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

పోలీసులకు సహకరించాలి..



సింగరేణి కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడానికి పోలీసులకు సింగరేణి గుడిసెవాసులు, వాంబే గృహ సముదాయాల వారు సహకరించాలి. వేలమంది నివసించే సింగరేణి ప్రాంతం కేవలం కొంత మంది చేస్తున్న అక్రమ వ్యాపారాలతో చెడ్డ పేరు వస్తోంది. సింగరేణిలో అక్రమంగా మద్యం, గంజాయి అమ్మే వారి గురించి వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి. తద్వారా సింగరేణి కాలనీని అక్రమ వ్యాపారాలకు దూరం చేయవచ్చు.

– కొర్ర మోతీలాల్‌నాయక్, సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు

కఠిన చర్యలతోనే నిర్మూలన..

గతంలో ఇక్కడ గుడుంబా అమ్మకాలను పూర్తిగా నియంత్రించడం కోసం తీసుకున్న విధానాలనే ఇప్పుడు గంజాయి విషయంలోనూ తీసుకోవాల్సిన అవసరం ఉంది. బెల్ట్‌షాపులు, గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే అది సాధ్యమవుతుంది. ఎక్సైజ్ పోలీసులు యువతకు అవగాహన సదస్సులు నిర్వహించడం, స్థానిక పోలీసులతో కలిసి తరచూ కార్డన్ సెర్చ్‌లు చేపట్టడం, క్రయవిక్రయాలు చేసే వారిపై తరచూ తనిఖీలు, దాడులు చేసి కేసులు నమోదు చేస్తేనే గంజాయి అమ్మకాల కట్టడి సాధ్యమవుతుంది.

కానీ ఇటీవల ఇక్కడ గంజాయి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొన్ని చోట్ల రహదారులపైనే యథేచ్ఛగా గంజాయి మత్తులో తూగుతూ కనిపిస్తున్నారు.

ఎక్సైజ్ పోలీసుల మౌనమెందుకో?

ప్రత్యేక రోజుల్లో నగరం మొత్తం మద్యం విక్రయాలు మూసివేసినా సింగరేణిలో మాత్రం నిరంతరం మద్యం దొరుకుతుందంటే నమ్మాల్సిందే. మామూలు రోజుల్లో మద్యం దుకాణాలు మూసినా సింగరేణి కాలనీలో మద్యం దొరుకుతుందనే నమ్మకంతో వివిధ ప్రాంతాల నుంచి మద్యం ప్రియులు ఇక్కడికి వస్తుంటారు. సింగరేణి కాలనీ ప్రధాన రహదారిపై రాత్రి సమయంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు భయపడిపోతున్నారు. ఇక్కడ గంజాయి, మద్యంమత్తులో సంచరించే కొందరు కార్లు, బైక్‌లపై వెళ్తున్న వారిని అటకాయించి నగదు, సెల్‌ఫోన్‌లు లాక్కొని మరీ బెదిరింపులకు పాల్పడుతున్నారు. సింగరేణి కాలనీలో అక్రమ మద్యం, గంజాయి అమ్మటం, వాడటం గురించి బహిరంగంగా తెలిసినా మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు కనీస చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మురికివాడ ప్రాంతం కాబట్టి తరచూ ఇక్కడ మత్తు పదార్థాల వాడకానికి వ్యతిరేకంగా ఎక్సైజ్ పోలీసులు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. యువతకు కౌన్సెలింగ్ చేయటం, మత్తు పదార్థాల వాడకం వలన కలిగే దుష్ప్రభావాలు వివరించటం చేయాలి. కానీ మలక్‌పేట ఎక్సైజ్ పోలీసులు ఆ దిశగా చేస్తున్న చర్యలు మాత్రం శూన్యం. కేవలం అక్కడక్కడ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా చిన్న పోస్టర్లు, స్టిక్కర్లు వేసి మళ్లీ అటువైపు కన్నెత్తి చూడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హయత్‌నగర్: డ్రగ్స్ కారణంగా యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పి.రవికిరణ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు ఆకర్షితులవుతున్నారని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా సంస్థలలో డ్రగ్స్ అమ్మే వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

వనస్థలిపురం: తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలని, ఆయన పేరును తొలగించడం అంటే మొత్తం తెలుగు జాతిని అవమానించినట్లేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం వనస్థలిపురంలోని గణేష్ కాన్ఫరెన్స్ హాల్లో జాగృతి అభ్యుదయసంఘం, ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు .భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నెల్లూరు జిల్లా తరహా కనీసం ఒక జిల్లాకైనా ఆయన పేరు పెట్టి గౌర వించాల్సింది పోయి తెలుగు యూనివర్సిటీకి ఉన్న ఆయన పేరును తొలగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన చేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో భావన శ్రీనివాస్, ఎస్‌జేఎస్.నందకిశోర్, పోతిరెడ్డి మాధవరెడ్డి, విట్టా దూరయ్య, డా.రవికుమార్, డా.నవీన్ గుప్తా, సతీష్, వరప్రసాద్, వెంకటేశం, నాగలక్ష్మి, సువిధ పాల్గొన్నారు.

తాను మరణిస్తూ ఏడుగురి జీవితాల్లో వెలుగులు

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఏడుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ ప్రైవేటు ఉద్యోగి. జీవన్‌ధాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. అదిలాబాద్ షెట్‌పల్లికి చెందిన రెవెల్లి శ్రీకాంత్(35) ప్రైవేటు హాస్పిటల్‌లో ఓటీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 6న తన బైక్‌పై వెళ్తుండగా మంచిర్యాల వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడటంతో ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో ఉంచి వైద్యం అందించారు. మూడ్రోజుల తర్వాత చికిత్సకు శ్రీకాంత్ స్పందించకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు శ్రీకాంత్ భార్య స్వప్న, కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించగా వారు ఒప్పుకోవడంతో శ్రీకాంత్ లివర్,రెండు కిడ్నీలు, ఊపిరితిత్తులు, రెండు కార్నియాలు, గుండెను జీవన్‌ధాన్‌కు దానం చేశారు.



రెవెల్లి శ్రీకాంత్ (ఫైల్)

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.25, వంకాయ రూ.45, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.28, దొండ రూ.33, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.23, కీర రూ.26, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.53. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

వైభవంగా నల్లపోచమ్మ కల్యాణం

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధి హస్తినాపురంలోని నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం రాత్రి కల్యాణం నిర్వహించగా శనివారం అమ్మవారికి కుంభ అభిషేకములు వెయ్యి కళశాలతో మంగళ స్నానాలు చేయించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నారగోని శ్రీనివాస్ యాదవ్ దంపతులు, ప్రధాన అర్చకులు దండే వినయ్‌శాస్త్రి, దండే అనిల్ శాస్త్రి, ఒగ్గు పూజారి మారయ్య, శివశక్తి సాగ అశోక్, బాలం లలిత ఈశ్వర్ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, కాలనీవాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్ మేనేజర్ నాగరాజ్‌గౌడ్ సూచించారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని ఇన్‌కమ్ టాక్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సొసైటీ ప్రతినిధులు రమేష్ బాబు, రాజేశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు మాట్లాడారు. కాలనీ వాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారన్నారు. శిబిరం ఆదివారం కూడా కాలనీలో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అన్నపూర్ణచ విజయలక్ష్మి, భగత్ పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయం వద్ద..

చాదర్‌ఘాట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ అన్నారు. శనివారం ఓల్డ్ మలక్‌పేట పోచమ్మ దేవాలయం వద్ద శాలివాహననగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. వైద్య సిబ్బంది పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమై వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, రాజ్ కుమార్, స్వరూపారాణి, ఇందిరా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



సేంద్రియ పద్ధతిలో పండించిన కాయగూరలతో విద్యార్థులు

చంపాపేట: విద్యార్థులలో నిగూఢమైన జ్ఞానాన్ని వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని క్రీడా శాస్త్రవేత్త డాక్టర్ నాగశ్రీ పేర్కొన్నారు. చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీలోని రవీంద్రభారతి గ్లోబల్ ఉన్నత పాఠశాలలో అగ్రినోవా ఫెస్ట్ పేరిట ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యాసంస్థల చైర్మన్ సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయక పద్ధతిలో సాగు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే విధానం, నేలలు వాటిరకాలు, సారం, మారుతున్న వాతావరణానికి అనుకూలంగా పండించే పంటలు, కోళ్ల ఫారాల నిర్వహణ, చేనేత, మత్స్య పరిశ్రమలు, తదితర అంశాలపై చిన్నారులు వివరించిన తీరు ఆలోజింపజేశాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రేవంత్, రాణి, జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, ఏజీఎం చంద్రశేఖర్, ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగాలి

మలక్‌పేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, స్థూపాల శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించారు. సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మూసారంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, నల్గొండ క్రాస్ రోడ్‌లోని స్వామి వివేకానంద విగ్రహాలకు పాలతో శుద్ధిచేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధులు చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో భరత్ కుమార్, సుభాష్ చందర్, మధుసూదన్ రెడ్డి, విజయ్ కాంత్, దేవేందర్ హరి గౌడ్, రమణ సింగ్, దినేష్ నవీన్, పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలంటూ ధర్నా



నిరసన తెలుపుతున్న స్థానికులు, కార్పొరేటర్

మన్సూరాబాద్: విజయవాడ జాతీయ రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను వెంటనే తొలగించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఆక్రమణలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో నిరసనకు దిగామన్నారు. ధర్నాలో కాలనీవాసులు ధర్మారావు, మరళీగౌడ్, సతీష్‌కుమార్, సత్యప్రియ, వెంకటరమణ, ప్రవీణ్, వెంకటేష్, జగన్, నర్సింహాగౌడ్, విజయభాస్కర్, సందీప్, సుబ్బారావు, సురేష్ నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ క్రాంతి క్లబ్ ఆవరణలోని పోచమ్మ అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడగండ్ల రాంచరణ్ శర్మ పర్యవేక్షణలో గణపతిపూజ, నవరత్న నవ ధాతున్యాసం, పోచమ్మ అమ్మవారి విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, లక్ష్మితామరగింజలతో సంపుటీకరణ హోమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హాజరై అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథ్‌గౌడ్, సభ్యులు మల్లేష్‌గౌడ్, విఠల్‌రెడ్డి, రాఘవేందర్, శివగౌడ్, జగదీష్‌గౌడ్, చందు, నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, దశరథ్‌గౌడ్ పాల్గొన్నారు.

గోవులను సంరక్షించడం బాధ్యతగా భావించాలి



గోపూజలో పాల్గొన్న అజిత్‌జీ మహాపాత్ర

సైదాబాద్: గోవులను సంరక్షించడం అందరూ తమ బాధ్యతగా భావించాలని ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత గోసేవా ప్రముఖ్ అజిత్‌జీ మహాపాత్ర అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలోని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోభక్తుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువులతో చేస్తున్న వ్యవసాయంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని,

అదే గో ఆధారిత వ్యవసాయంతో రైతులు ఆరోగ్యకరమైన పంటలను పండిచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్, జిగ్నేష్‌దోషి, విజయ, లోకేష్ యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మురళీకృష్ణ, గుడాల రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కొత్తపేటలో అమ్మవారి ఘటం ఊరేగింపు

నాగోలు: కొత్తపేటలో నేడు (ఆదివారం) అమ్మవారి ఘటం ఊరేగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు యశ్పాల్ గౌడ్ తెలిపారు. శనివారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో అమ్మవారి ఘట్టం ఊరేగింపునకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం మధ్యాహ్నం మోహన్‌నగర్ బీజేపీ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై వివిధ కాలనీలో అమ్మవారి దేవాలయాల మీదుగా సత్యనగర్ కాలనీలో బంగారు గవ్వల రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు కొనసాగుతుందన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకుడు మురళీధర్ రావుతో పాటు వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, వినోద్, తరుణ్, కొర్లపల్లి రాజు, అవినాష్, చింటూ, భావన, శ్రీ వాస్తు, వెంకటేష్, సాయి నితిన్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు